క్లుప్తంగా

నీటి సరఫరాకు అంతరాయం కలగొద్దు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీలో నీటి సరఫరా విషయంలో అలసత్వం వహించవద్దని, నీటి సరఫరాపై ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రజల నీటి కష్టాలను తీర్చాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను గుర్తించి పరిష్కరించాలన్నారు.

విధుల్లో చేరిన గణేష్ టెంపుల్ ఈఓ



బాధ్యతలు చేపడుతున్న రజనీకుమారి

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని శ్రీశ్రీశ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్) ఈఓగా ఎన్.రజనీకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బేల్‌సింగ్ ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు. రజనీకుమారి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని భక్తులకు మరింతగా సౌకర్యాలను మెరుగు పరుస్తానని చెప్పారు.

ఆలయ కమిటీ రద్దు

కొత్తగూడెంటౌన్: మున్సిపాలిటీలోని 6వ వార్డు వేణుగోపాల్‌నగర్ కాలనీ (రామవరం)లోని వేణుగోపాల స్వామి ఆలయ నూతన కమిటీని త్వరలో ఎన్నుకుంటామని, ఆలయ ధర్మకర్త చిలకబత్తుల గోవర్దన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆలయ కమిటీని రద్దు చేయడం జరిగిందని, రానున్న కృష్ణాష్టమి ఉత్సవాల కోసం నూతన కమిటీని త్వరలో ఎన్నుకుంటామని ఈ కమిటీలో ఎవరైనా చేరవచ్చని తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ

చుంచుపల్లి: తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో మంగళవారం గరిమెళ్లపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, లాంగ్ స్కేల్స్, పెన్సిల్స్, ఎరేజర్స్, బ్యాగ్స్, అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు, బలపాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ... పదేళ్లుగా విద్యానగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సురేష్ కుమార్, హెచ్‌ఎం సీతారాములు, పేరెంట్స్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సోమశేఖర్‌రావు, జానకీరావు, సోందుబాబు పాల్గొన్నారు.

యూనిఫాం అందించండి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం తక్షణమే అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1న కళాశాలలు, జూన్ 12న పాఠశాలలు ప్రారంభమై నెల దాటినా, నేటి వరకు విద్యార్థులకు యూనిఫాం అందలేదని పేర్కొన్నారు.

‘చలో అసెంబ్లీ ముట్టడి’

ఇల్లెందు: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 31న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ కోరింది. మంగళవారం పీడీఎస్‌యూ, పీవైఎల్ సంయుక్త సమావేశంలో నేతలు మస్తాన్, రవి మాట్లాడుతూ.. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి 7 శాతం కేటాయించటం దుర్మార్గం అన్నారు. ఈ సమస్యలపై తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని కోరారు. చింత నరసింహరావు, మోతీలాల్, సతీస్, శేఖర్, లాజర్ పాల్గొన్నారు.

ఏజెన్సీకి బస్సు ప్రయాణం కలేనా!

- పలు గ్రామాలకు ఆటోలే దిక్కు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- ఉచిత బస్సు అందని ద్రాక్షే అంటున్న మహిళలు





బస్సులు రాక ఆటోలో ప్రయాణిస్తున్న ఏజెన్సీ గ్రామాల ప్రజలు, పల్లెవెలుగు బస్సు

పాల్వంచరూరల్: ఏజెన్సీలోని గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు నడవక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ ఉచిత ప్రయాణం అందకుండా పోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు మాత్రం నడవడం లేదు. రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాలకు కూడా రోడ్లు నిర్మించారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాల్వంచ మండలం ఏజెన్సీలోని 36 గ్రామ పంచాయతీల ప్రజలకు ఆర్టీసీ బస్సులు ఎక్కే భాగ్యం కలగడం లేదు. ఏజెన్సీ గ్రామాలైన చంద్రాలగూడెం, రేగుల గూడెం, ఉల్వనూరు. నర్సింహాసాగర్, మల్లారం, సారెకల్లు, కారెగట్టు, రెడ్డిగూడెం, యానంబైల్, కిన్నెరసాని, పాండురంగాపురం, సూరారం, సోముల గూడెం, దంతలబోరు, తోగ్గూడెం, నాగారం వంటి మారుమూల గ్రామాలకు రూ.కోట్లు ఖర్చు చేసి తారురోడ్లు నిర్మించారు. ఇంతకు ముందు ఏజెన్సీలోని గ్రామాలకు వెళ్లాలంటే రోడ్లు, బ్రిడ్జిలు లేని కారణంగా బస్సులు నడిచే పరిస్థితి ఉండేది కాదు. కానీ నేడు మారుమూల గ్రామాలతోపాటు గిరిజన తండాలకు కూడా తారు రోడ్లు వేశారు. అయినా బస్సు సర్వీసులు నడవడం లేదు.

దండుకుంటున్న ప్రైవేట్ వాహనదారులు..

మండల కేంద్రమైన పాల్వంచకు 40 కిలోమీటర్ల దూరంలో గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఉలవనూరు నుంచి పాల్వంచకు ఆటో చార్జీలు రూ.50, దంతలబోరు నుంచి రూ.40, ఎస్సీ కాలనీ నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు ఆర్థిక భారమై చదువులకు దూరమవుతున్నారు. నిరుపేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం ఉపయోగపడం లేదు. దంతలబోరు ఎస్సీ కాలనీ పంచాయతీ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని గతేడాది అప్పటి గ్రామపంచాయతీ సర్పంచ్ గద్దల రమేష్ ఆర్టీసీ డీఎంను కోరారు. కొద్దిరోజులు బస్సు నడిపించి తర్వాత నిలిపి వేశారు.

ఇబ్బంది పడుతున్న పర్యాటకులు...

పాల్వంచ, కొత్తగూడెం నుంచి ఇంతకు ముందు పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. ఇప్పుడు నిలిపివేశారు. దీంతో పర్యాటకులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్టీసీ డీఎం స్పందించి తారురోడ్డు ఉన్న గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

కొత్తగూడెం – కిన్నెరసాని బస్సు నడపాలి...

కొత్తగూడెం నుంచి పాల్వంచ మీదుగా పెద్దమ్మగుడి, సోములగూడెం, కమ్మరిగూడెం, సూరారం, పాండురంగాపురం, రెడ్డిగూడెం, యానంబైల్, రాజాపురం మీదుగా కిన్నెరసాని వరకు నిత్యం బస్సు నడిపితే పెద్దమ్మతల్లి భక్తులకు, కిన్నెరసాని పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుంది. ఇటు ఆర్టీసీకి కూడా ఆదాయం వస్తుంది.

ఆర్థికంగా నష్టపోతున్నాం..



ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం పొందలేకపోతున్నాం. పాల్వంచకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి రావడంతో ఆర్థిక భారమవుతోంది. చార్జీలు పెరగడంతో ఇబ్బందిగా ఉంది.

– వాసం రుద్ర, ఉల్వనూరు

కిన్నెరసానికి బస్సు నడపాలి..



పాల్వంచ నుంచి కిన్నెరసాని వరకు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు రావడం లేదు. దీంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. పర్యాటకుల కోసమైనా బస్సులు నడిపించాలి.

– బొర్ర వీరాకుమారి, కిన్నెరసాని

రూట్లను పరిశీలిస్తాం..



ఎక్కడెక్కడ నడిపితే ఆదాయం వస్తుందో పరిశీలిస్తాం. గతంలో పాల్వంచ నుంచి రేగులగూడెం, కిన్నెరసాని వరకు బస్సులు నడిపి ఆదాయం రాక నిలిపివేయడం జరిగింది. కొత్త బస్సులు వచ్చిన తర్వాత ఆలోచన చేస్తాం. – ఎం.దేవేందర్‌గౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్, కొత్తగూడెం

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని అడ్డుకోవాలి



మాట్లాడుతున్న బ్రహ్మేచారి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియను నిరసిస్తూ రాష్ట్ర శాసనసభ తీర్మానం చేయాలని, కేంద్ర వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష పోరాటానికి ముందుకు రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.బ్రహ్మేచారి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే 5మైన్ వద్ద మంగళవారం సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఫిట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికుల సొంతింటి పథకం అమలు, కాంట్రాక్ట్ కార్మికుల పర్మనెంట్, లాభాల వాటా పంపిణీపై శాసనసభలో ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే విధానాలపై పార్లమెంట్‌లో, బయట సీపీఎం పోరాటాలు చేస్తోందన్నారు. కొంతమంది కార్పొరేట్ అధిపతుల కోసం సింగరేణికి గనులు కేటాయించకుండా చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలన్నారు. దీని కోసం రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలను కలుపుకుని ప్రజాఉద్యమం చేపట్టాలని కోరారు. ఆగస్టు 5న కొత్తగూడెంలో జరిగే బస్సు యాత్ర, ముగింపు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, సీఐటీయూ నాయకులు ఎలగొండ రఘు, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిలిపివేయాలని, సింగరేణిని పరిరక్షించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐటీయూ, అంగన్‌వాడీ నేతలు కృష్ణ, వెంకటమ్మ మాట్లాడారు.

మున్సిపల్ కమిషనర్‌గా డాకునాయక్

పాల్వంచ: హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్‌గా పనిచేస్తున్న డి.డాకు నాయక్ పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎ.స్వామి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

నేడు సర్వసభ్య సమావేశం

సుజాతనగర్: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

బస్‌పాస్‌ల శిబిరం

పాల్వంచ/సుజాతనగర్: ఆగస్టు 1న పాల్వంచ బస్టాండ్‌లో, 3న సుజాతనగర్‌లో దివ్యాంగుల కొరకు ప్రత్యేక బస్‌పాస్‌ల శిబిరం ఏర్పాటు చేసినట్లు కొత్తగూడెం ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కన్వెయన్స్ డ్రైవర్ ఎస్‌డీ బాజీ కుటుంబాన్ని తోటి డ్రైవర్లు ఆర్థికంగా ఆదుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రైవర్లు గోపీ, ఆలీ, బాయ్, ప్రేమ్‌లు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

సేవాలాల్ సేన కమిటీ నియామకం

పాల్వంచ: సేవాలాల్ సేన పాల్వంచ మండల అధ్యక్షుడిగా జర్పుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా మాలోతు ప్రశాంత్, యువసేన మండల అధ్యక్షుడిగా బానోతు కుమార్‌లను ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక గిరిజన భవన్‌లో బానోతు భరత్ నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి రాష్ట్ర కన్వీనర్ బానోతు హుస్సేన్ నాయక్ నియామకపత్రాలను అందించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జూలూరుపాడు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం శంభునిగూడెం గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, ఏఎన్‌ఎం సావిత్రి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం..

ఇల్లెందు: ఓ వ్యక్తిని మరో వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టిన సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. జగదాంబా సెంటర్‌కు చెందిన ఫొటో గ్రాఫర్ దాస్యం ప్రవీణ్‌కుమార్ బైక్ మీద ఇంటికి వెళ్లే క్రమంలో మూలమలుపు వద్ద బైక్‌తో అటుగా వచ్చిన టీచర్ జానీమియా ఢీ కొట్టారు. ప్రవీణ్‌కుమార్‌కు తీవ్ర గాయలయ్యాయి. ఆయన సోదరుడు సురేంద్ర బాబు ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రవి కేసు నమోదు చేశారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్



అరెస్టును నిరసిస్తున్న ఆశా కార్యకర్తలు

ఇల్లెందు: తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి చలో కమిషనరేట్ కార్యక్రమం చేపట్టిన ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం ఆశా కార్యకర్తలను స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ హయాంలో వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నప్పుడు ఆ సమ్మె శిబిరాల్లోకి వచ్చి తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని ప్రకటించిన కాంగ్రెస్ నేతలు ఈ రోజు ముందస్తు అరెస్టులు చేయటం దుర్మార్గం అని సీఐటీయూ నాయకులు నబీ అన్నారు.

అరెస్టయిన వారిలో చీమల రమణ, మణెమ్మ, ఝాన్సీ, చంద్రకళ, సావిత్రి, అమల, నాగలక్ష్మి, రాంబాయి, కళ, కౌసల్య, కమల, సుగుణ ఉన్నారు.

రంగస్థల కళాకారుడికి అవార్డు

పాల్వంచ: పాల్వంచకు చెందిన రంగస్థల కళాకారుడు పాకాలపాటి రోశయ్య చౌదరికి ‘హనుమా’అవార్డు లభించింది. తిరుపతిలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ స్థాయి నాటకోత్సవాల్లో ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ నుంచి బ్రహ్మర్షి విశ్వామిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో వశిష్టుడి పాత్ర పోషించిన రోశయ్యకు ఉత్తమ సహాయ నటుడిగా హనుమా అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా పాల్వంచలోని పాకాల పాటి కృష్ణయ్య కళాభవన్‌లో మంగళవారం ఆయనను సన్మానించగా కళాకారులు పాతూరి రామ్మోహన్‌రెడ్డి, ఎస్.కే.ఖాసీం, రసూల్, మహబూబ్, మౌలా, మీరా, గోవర్ధన్, శ్రీపాద సత్యనారాయణ, బాలస్వామి, మోహన్, బొల్లం రాంబాబు, కాల్వ విజయ్ పాల్గొన్నారు.

‘తిథి భోజనాలకు దాతలు సహకరించాలి’



కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు అందజేస్తున్న దృశ్యం



పాల్వంచరూరల్: జగన్నాథపురంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనాలకు గ్రామంలో దాతలు సహకరించాలని ఎంఈఓ శ్రీరామ్మూర్తి కోరారు. జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలోమంగళవారం మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తిథి కార్యక్రమాన్ని ఎంఈఓ ప్రారంభించారు. ఉపాధ్యాయురాలు సులోచన సొంతఖర్చులతో విద్యార్థులకు చికెన్‌తో మధ్యాహ్న భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు గ్రామాల్లోని దాతలు ముఖ్యమైన పండుగలు, శుభకార్యాలు, జన్మదినోత్సవాలు జరుపుకునేవారు విద్యార్థులకు పండ్లు, ఇతర ఆహార పదార్థాలను అందించాలని ప్రభుత్వ సంకల్పించి తిథి అనే పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనిలో భాగంగానే జగన్నాథపురంలోని పాఠశాల ఉపాధ్యాయులు ముందుకొచ్చి చేయూతనిచ్చినట్లు తెలిపారు. హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కూలీలైన్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాధికారి సూచనలతో మధ్యాహ్న భోజనంతో పాటు స్వీట్లు, పండ్లను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి మాట్లాడుతూ.. తిథి భోజన కార్యక్రమం పాఠశాలలు, సమాజం మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లాల్‌సింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రామవరంలోని నేతాజీ పాఠశాలలో కూడా తిథి కార్యక్రమంలో నిర్వహించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అరటి పండ్లను అందించారు. హెచ్‌ఎం, నోడల్ అధికారి ప్రభుదయాల్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక శ్రీ ఉమాసోమలింగేశ్వర ఆలయం చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొదుమూరి కోటేశ్వరరావు పండ్లు పంపిణీ చేశారు. బానోత్ నవీన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ప్రభుత్వం రూ.1.50 లక్షల రుణమాఫీని హర్షిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకుడు, అఖిల భారత కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొత్వాల ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాలె జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, నూకల రంగారావు, బద్ది కిషోర్, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కనగాల నారాయణ, కాపర్తి వెంకటాచారి, కె.నాగిరెడ్డి, బాలినేని నాగేశ్వరరావు, చింతా నాగరాజు, కె.రాము, శనగ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’ని సద్వినియోగం చేసుకోండి

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని పేదవర్గాలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ పురుషోత్తం సూచించారు. మండలంలోని లచ్చగూడెం గ్రామంలో గృహజ్యోతి పథకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు వినియోగదారులు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకుంటే గృహజ్యోతి పథకానికి అర్హులు అవుతారని చెప్పారు. పథకం వర్తింపు కోసం చేసిన దరఖాస్తులో ఏమైనా తప్పులు జరిగితే అర్హత ఉన్నా పథకం వర్తించని వారు నేరుగా మండల పరిషత్ కార్యాలయంలో సరి చేయించుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేయనివారు ప్రభుత్వం అవకాశం కల్పించిన సమయంలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో విద్యుత్ చౌర్యం జరగకుండా ప్రజలు బాధ్యత తీసుకోవాలని కోరారు. సదస్సులో ట్రాన్స్‌కో ఏడీఈలు కోటేశ్వరరావు, గోవర్ధన్, ఏఏఓ లవణ్‌కుమార్, ఏఈలు పవన్, వెంకటేశ్వర్లు, నితిన్, లైన్‌ఇన్‌స్పెక్టర్ చలమయ్య పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



సమావేశానికి హాజరైన అధికారులు

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వానాకాలంలో దోమలు తీవ్రమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, దోమతెరలను పంపిణీ చేయాలని ఎంపీటీసీలు అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మడవి సరస్వతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. దోమతెరల కోసం ప్రతిపాదనలు పంపించామని రాగానే పంపిణీ చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆర్థిక భారమై విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ గురువయ్య డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు ప్రజాసేవలో పదవికి వన్నె తేవాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను ప్రజాప్రతినిధులు పూలమాలలతో సత్కరించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, తహసీల్దార్ వివేక్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ రంగా, ఏపీఎం రాంబాబు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యాంజలి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

టేకులపల్లి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విద్యాంజలి ర్యాలీ నిర్వహించారు. తొలుత హెచ్‌ఎం ఎం.జ్యోతిరాణి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, శిక్షా సప్తాహ్ ప్రాముఖ్యత గురించి, విద్యాంజలిలో భాగంగా సమాజంలోని ఎవరైనా వారి దైనందిన జీవితంలో ప్రాధాన్యత కలిగిన రోజుల్లో (పుట్టినరోజు, పెళ్లి రోజు, వార్షికోత్సవం, జ్ఞాపకార్థం రోజుల్లో) ప్రభుత్వ పాఠశాలలో తిథి భోజనం సమర్పించవచ్చని, దీపి ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో సమాజ భాగస్వామ్యం గురించి తల్లిదండ్రులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భవాని, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, విజయ, తల్లిదండ్రులు సురేష్, రవీంద్రబాబు, అనిల్, బుజ్జి, నవగన్యా, నవ్యశ్రీ, సారిక, టీచర్ జె.పద్మ, ఐఆర్పీ టీచర్ నీరజ, వలంటీర్ శారద, ఎండీఎం ఇన్‌చార్జ్ సరోజ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి..



మున్సిపల్ కమిషనర్ స్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: స్వచ్ఛ పేరుతో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, మున్సిపాలిటీ నుంచే నెలకు రూ.10వేల వేతనం అందించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో స్వచ్ఛ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐదేళ్లుగా జీత భత్యాలు లేకుండానే పనిచేస్తున్నారని, ఇతర మున్సిపాలిటీల్లో రూ.10వేల వేతనం అందిస్తున్నారని, అదే తరహాలో పాల్వంచ మున్సిపల్ కార్మికులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హరితహారం పేరుతో పనిచేసే కార్మికుల సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఇట్టి వెంకట్రావ్, జకరయ్య, వల్లపు యాకయ్య, శనగరపు శ్రీనివాసరావు, మన్యం వెంకన్న, కార్మికులు ధరావత్ బాలాజీ, నాగరాజు, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

జీఎం, అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ హోదాలలో పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ చేస్తున్న కార్పొరేట్ చీఫ్ సేఫ్టీ జనరల్ మేనేజర్ గురవయ్యను, సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో అడిషనల్ సీఎంఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ విక్టర్ వందనం, కొత్తగూడెం ఏరియాలో ఎంవీటీసీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న బీవీఎస్ శర్మ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ త్యాగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, సీనియర్ అండర్ మేనేజర్ కలవల చంద్రశేఖర్, అల్బర్ట్, ట్రెజరర్ భీముడు, పిట్ కార్యదర్శులు గోపు కుమారస్వామి, చిలక రాజయ్య, ఎండీ సత్తార్‌పాషా, ఈ.మోహన్‌రెడ్డి, నటరాజన్, శనిగరపు కుమార్, డి.శంకర్‌బాబు, కె.కోటేశ్వరరావు, శ్రీబాంచి కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంట చేలు



వరదనీటిలో మునిగిన వరినాట్లు, పొలం గట్ల వద్ద చేపలు పట్టుకుంటున్న స్థానికులు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలంలో మంగళవారం అత్యధిక వర్షపాతం నమోదైంది. తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా రెండు గంటలపాటు కురిసిన భారీ వర్షంతో వాగులు పొంగిపొర్లాయి. చెరువులలోకి భారీగా వరదనీరు చేరడంతో అలుగు పోశాయి.

ఏజెన్సీ గ్రామాల్లోని మస్సివాగు కట్టచెరువు, బందంకుంట చెరువు, పోచారం చెరువు, పోలారం పెద్ద చెరువు తదితర చెరువుల నుంచి వరద నీరు మత్తిడి పోస్తుండడంతో సమీపంలోని పంట చేలు పూర్తిగా నీటమునిగాయి. పక్షం రోజులుగా ముసురు కొనసాగుతుండటంతో రైతులు ముందస్తుగా వరినాట్లు ప్రారంభించారు. కానీ మంగళవారం కురిసిన భారీ వర్షంతో వరినాట్లు పూర్తిగా నీటమునిగాయి. పలు గ్రామాలలో పత్తి, మొక్కజొన్న చేలలో వరద నిలిచిపోయింది.